# చిన్న భాషల్ని మింగేస్తున్న పెద్ద భాషలు

- నూర్‌బాషా రహంతుల్లా

గత పది సంవత్సరాలలో 516 భాషలు దాదాపుగా అంతరించి పోయాయట. చాలా కొద్దిమంది పెద్దవాళ్ళు మాత్రమే ఆ భాషలు మాట్లాడుతున్నారట. ప్రస్తుతం 7299 భాషలు ప్రపంచంలో వాడకంలో ఉన్నట్లు గుర్తించిన సంస్థలు, వాటిలో సగానికి సగం రాబోయే తరానికి అందకుండా అంతరించిపోయే దశలో ఉన్నాయని చెబుతున్నాయి. అంతరించిపోయే దశలో ఒక భాష ఉంది అనటానికి ప్రాతిపది కలు ఏంటంటే- 1. ఆ భాషను పెద్దవాళ్ళు పిల్లలకు నేర్పరు. 2. రోజువారీ వ్యవహారాల్లో వాడరు. 3. ఆ భాష మాట్లాడే జనం సంఖ్య తగ్గిపోతుంటుంది. 4. ప్రభుత్వం, దేవాలయం కూడా ఆ భాషను ఉపయోగించవు. 5. ఆ భాషను కాపాడుకోవాలని ప్రజలు సంఘటి తంగా ఉద్యమించరు. 6. ఆ భాష పట్ల గౌరవ భావం ప్రజల్లో ఉండదు. 7. ఆ భాష అక్షరా లను గానీ, సాహిత్యాన్ని గానీ ఆ ప్రజలు విరివిగా వాడరు.

Ethnologue.comలో ఈ అంతరిచి పోతున్న భాషల చిట్టా ఉంది. ఆఫ్రికాలో 46, అమెరికాలో 170, ఆసియాలో 78, ఐరోపాలో 12 పసిఫిక్ లో 210 భాషలు ఈ చిట్టాలో ఉన్నట్టు తెలిపారు. ఇక ఇండియా విషయానికి వస్తే 17 భాషలు అంతరించాయట. అవి:

**1. పుచిక్ వార్** : అండమాన్ దీవుల్లో 2000 సంవత్సరంలో కేవలం 24 మంది షెడ్యూలు తెగల వాళ్ళు మాట్లాడుతున్నారు. ఈ భాషను హిందీ మింగేసింది.

**2. కామ్యాంగ్** : 2003 నాటికి అస్సాంలో 50 మంది ఈ భాషను మాట్లాడేవాళ్ళు మిగిలారు. కాస్త ముసలివాళ్ళు మాత్రం తాయ్ లిపిలో ఈ భాష రాసేవాళ్ళట. ఇదీ గిరిజన భాషే. అస్సామీ భాష దీన్ని మింగింది.

**3. పరెంగా** : 2002 నాటికి ఒరిస్సా, కోరాపుట్ జిల్లాల్లో 767 మంది మిగిలారు. ఈ భాష మీద మన తెలుగు విశ్వవిద్యాలయం వాళ్ళు కూడా పరిశోధన చేశారు. ఈ భాష మాట్లాడే 'గడబ' అనే గిరిజన తెగ క్రమేణా ఆదివాసీ ఒరియా భాషలోకి మారిపోయారు.

**4. రూగా** : మేఘాలయలోని ఈ భాష నామ రూపాల్లేకుండా అంతరించి పోయింది. మిగిలిన కొద్దిమంది గారో భాషలోకి మళ్ళారు.

**5. అహోం** : అస్సాం ప్రాంతంలో పూర్వం 80 లక్షల మంది మాట్లాడే ఈ భాషను మాట్లాడే వాళ్ళే లేరు. కేవలం మంత్ర తంత్రల్లో మాత్రమే ఈ భాషను వాడుతున్నారు.

**6. అకాబియా** : అండమాన్ దీవుల్లోని ఈ భాషలు అంతరించిపోయాయి. అవి : 7. అకాబో, 8. అకాకరి, 9. అకాజెరు, 10. అకాకెడి, 11. అకాకోల్, 12. అకాకోరా, 13. అకర్‌బాలె, 14. ఒకొజువోయ్.

**15. పాలి** : బౌద్ధమత సాహిత్యం ఈ భాషలో ఓనాడు వికసించింది. 1835లో బైబిల్‌లోని కొత్త నిబంధన కూడా ప్రచురించారీ భాషలో. ఇండియాలో నాశనమైపోయింది. శ్రీలంక, బర్మా, టిబెట్‌లలో ఇంకా కొంతమంది ఈ భాష మాట్లాడే వాళ్ళున్నారంటారు.

**16. రంగకస్** : ఉత్తరాంచల్ ప్రాంతాల్లో జొహరి అని కూడా పిలిచే ఈ భాషస్తులు ఓ వెయ్యి మంది ఉండొచ్చట. ఈ భాషాపోయింది.

**17. తురుంగ్** : అస్సాం గొలాగట్ జిల్లాలోని ఈ గిరిజన జనం మెల్లగా సింగ్‌పో భాషలోకి మళ్ళారట.

ప్రతి రెండు వారాలకు ఒక భాష చచ్చిపోతోం దని భాషా శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రపం చంలోని 6800 భాషలలో 90శాతం భాషలు ఈ శతాబ్దంలోగా అంతరించిపోతాయట. ఎందుకంటే వాటిలో సగం భాషలు మాట్లాడేవారు 2500 మంది కంటే తక్కువగా ఉన్నారట. వరల్డ్ వాచ్ సంస్థ హెచ్చరిక ఇది. యుద్ధాలు, హత్యాకాండలు, ప్రకృతి బీభత్సాలు పెద్ద భాషల్ని ఆశ్రయించటం లాంటివన్నీ ఇందుకు కారణాలట. ఒక తరం నుండి మరో తరానికి భాషను తరలించటానికి కనీసం లక్ష మందైనా ఆ భాష మాట్లాడే వాళ్ళుండాలని లేకపోతే ఆ భాస అంతరిస్తుం దని యునెస్కో ప్రకటించింది.

ఏ మతం వాళ్ళు ఎంత మంది పెరిగారు. ఎంతమంది తరిగారు లాంటి లెక్కల్ని తప్పుల తడకలతో హడావుడిగా పార్లమెంటుకు అందజేసి, తరువాత నాలుక కరచుకన్న కేంద్ర గణాంక శాఖ 2001 నాటి భాషల వారీ జనాభా లెక్కల్ని ఇంతవరకూ మన ప్రజల ముందు ఉంచలేదు. భాషల అభివృద్ధికి, ప్రంచవర్ష ప్రణాళికల్ని ఆపుచేసి దశ వర్ష ప్రణాళికగా మార్చుకోవాల్సిందేనా? భాషల జనాభా వివరాలు చెప్పటానికి ఆరేళ్ళు సరిపోలేదా ? 90 లక్షల మంది గుడ్డివాళ్ళు, కోటీనలభై లక్షల మంది చెవిటి వాళ్ళకు లేని బాధ మీకెందు కంటున్నారు సెన్సస్ వాళ్ళు. ఇప్పుడు 2001 జనాభా లెక్కల్లో 428 భాషలు నమోదయితే వాటిలో 415 వాడకంలో ఉంటే 13 భాషలు నశించిపోయాయట. ఎనిమిదవ షెడ్యూలు లోకి మరో నాలుగు భాషలు కలిపి నందున, షెడ్యూలు భాషల సంఖ్య 22కు పెరిగింది. వాటి వివరాలు పట్టికలో చూడండి -

| షెడ్యూల్డు భాషలు | | 1991 | | 1997 అంచనా | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| క్రమ సంఖ్య | భాష పేరు | జనాభా లక్షల్లో | % | జనాభా లక్షల్లో | లిపి | తొలి బైబిల్ అచ్చు వేసిన సంవత్సరం | తొలి ఖుర్ఆన్ ముద్రించిన సంవత్సరం | అధికార భాషగా ఉన్న రాష్ట్రాలు |
| 1. | హిందీ | 3372 | 39.84 | 3638 | దేవనాగరి | | 1818 | అరుణాచల్‌ప్రదేశ్ అండమాన్ & నికోబార్, బీహార్, చండీఘుర్, ఛత్తీస్‌ఘుర్, ఢిల్లీ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉ. ప్రదేశ్, ఉత్తరాంచల్ |
| 2. | బెంగాలీ | 695 | 8.21 | 706 | బెంగాలీ | | 1809 | త్రిపుర, ప. బెంగాల్ |
| 3. | తెలుగు | 660 | 7.80 | 697 | తెలుగు | | 1854 | ఆంధ్రప్రదేశ్ |
| 4. | మరాఠి | 624 | 7.37 | 680 | దేవనాగరి | | 1821 | మహారాష్ట్ర |
| 5. | తమిళ్ | 530 | 6.26 | 615 | తమిళ్ | | 1727 | తమిళనాడు, పాండిచ్చేరి |
| 6. | ఉర్దూ | 434 | 5.13 | 481 | అరబిక్ | | 1848 | జమ్ము కశ్మీర్ (ఢిల్లీ, ఉ.ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ 2వ) |
| 7. | గుజరాతీ | 406 | 4.80 | 455 | గుజరాతీ | | 1823 | గుజరాత్, డయ్యూబ్, డామన్, నాగర్‌హవేలి |
| 8. | కన్నడ | 327 | 3.86 | 353 | కన్నడ | | 1831 | కర్నాటక |
| 9. | మళయాళం | 304 | 3.59 | 354 | మళయాళం | | 1841 | కేరళ, లక్షద్వీప్ |
| 10. | ఒరియా | 280 | 3.31 | 317 | ఒరియా | | 1815 | ఒరిస్సా |
| 11. | పంజాబీ | 233 | 2.75 | 271 | గురుముఖి, దేవనాగరి | | 1959 | పంజాబ్ (ఢిల్లీ 2వ) |
| 12. | ఇంగ్లీషు | 178 | 2.10 | 200 | రోమన్ | | 1382 | ఇండియా |
| 13. | అస్సామీ | 130 | 1.53 | 153 | బెంగాలీ | | 1833 | అస్సోమ్ |
| 14. | మైథిలీ | 78 | 0.92 | ---- | నేపాలీ దేవనాగరి | | 1914 | బిహార్ |
| 15. | సంతాలి | 52 | 0.61 | 60 | ఒరియా, రోమన్ | | 1914 | ------------- |
| 16. | కశ్మీరీ | 31 | 0.37 | 44 | ఉర్దూ | | 1899 | జమ్ము & కశ్మీర్ |
| 17. | సింధీ | 21 | 0.25 | 28 | అరబిక్ గురుముఖి | | 1954 | -------------- |
| 18. | నేపాలి | 20 | 0.24 | 60 | నేపాలి | | 1914 | సిక్కిం |
| 19. | కొంకణి | 17 | 0.20 | 36 | కొంకణి | | 1970 | గోవా |
| 20. | మణిపురి (మైథీ) | 13 | 0.15 | 12.4 | బెంగాలీ | | 1984 | మణిపూర్ |
| 21. | బోడో | 12 | 0.14 | 7 | రోమన్, దేవనాగరి, బెంగాలీ | | 1981 | అస్సాం |
| 22. | డోగ్రి | 0.9 | 0.01 | 21 | ఉర్దూ, హిందీ, నాస్తాలిక్ | | 1826 | జమ్ము & కశ్మీర్ |
| 23. | సంస్కృతం | 0.49 | 0.01 | 1.94 | దేవనాగరి | | 1822 | ------------- |
| | | **8418.39** | **99.47** | **9190.34** | | | | |

ప్రమాదంలో పడిన భాషల్ని రక్షించేందుకై ఒక సంస్థ ఈ సంవత్సరం అక్టోబరు 25-27 తేదీలలో మైసూరులో ఒక సమావేశం నిర్వహిస్తోంది. 'చిన్న భాషల మీద బహుళ భాషావాద ప్రభావం' అనేదే చర్చాంశం. ఈ సంస్థ ఆశయాలు నాశన మైపోతున్న భాషల గురించి హెచ్చరించటం, ఆ భాషల వాడకాన్ని పెంచి, అన్ని విధాల తోడ్పాటునందించటం 'www.ogmios.org' అనే వెబ్‌సైట్ చూడండి.

ఒక పిల్లవాడు పన్నెండేళ్ళ వయసులో అద్దాన్ని పట్టుకొని బిద్దం బిద్దం అంటుంటే తల్లి దండ్రులు తెగ సంతోషపడిపోయి పన్నెండేళ్ళ బాల కుమారుడా ఇక ఇంట్లోనే ఏదో చెయ్యి అన్నారట. మొత్తం మీద ఇంతకు ముందు తెలుగు మాట్లాడేందుకు నోరు వాయి పడిపోయిన అనేక పార్టీలకు, సంస్థలకు ఇప్పుడు నోరు పెగులు తోంది. ఇక చూసుకోండి మా వ్యవహారాలన్నీ తెలుగులోనే నడుపుతాం అంటున్నారు. చాలా సంతోషం కలుగుతోంది. ఇప్పుడు ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గంగిశెట్టి లక్ష్మీనారాయణ కూడా ఈ ప్రతిజ్ఞల పరంపరలో గొంతు కలిపారు. ఇన్నాళ్ళూ ఇంగ్లీషులో ఉత్తర ప్రత్యుత్తరాలకు అలవాటుపడిన వాళ్ళకు తెలుగులో వ్యవహారాలు నడపాలంటే కొన్ని కష్టాలు వస్తాయి. వాటితో పోరాడాలి. వాటిని జయించాలి. తెలుగు ఫాంట్లు, సాఫ్ట్‌వేర్ నిరంతరం అభివృద్ధి పరుస్తూ ఉండాలి. ఇంగ్లీషుకు దీటుగా వాటిని మెరుగుపరచాలి. తెలుగు మేధావులంతా తలా ఒక చెయ్యి వేస్తే ఇదేమంత కష్టం కాదు. తెలుగు వార్తా పత్రికల వాళ్ళు కాలానుగుణంగా తెలుగును ఎంతో అభివృద్ధి పరచలేదా?

1947 నాటికి కేవలం రాత ప్రతుల్లో ఉన్న హెబ్రూ భాషను పునరుద్ధరించుకొని, ఇస్రాయిల్ జాతీయ భాషగా కాపాడుకుంటున్న 50 లక్షల మంది యూదుల్ని చూచి మనం నేర్చుకోవాలి. 1999లో కేవలం నలుగురు విద్యార్థులకు హవాయి భాష ప్రత్యేకంగా నేర్పి పట్టభద్రుల్ని చేశారు. ఇప్పుడు వెయ్యి మంది ఆ భాష మాట్లాడుతున్నారు. మాతృ భాషాభిమానంగల ప్రజలు, ప్రభుత్వం, విద్యా సంస్థలు అన్నీ ఏకమయితే వారి మాతృభాష రాజ్యం ఏలుతుంది. నలుచెరగులా విస్తరిస్తుంది. విస్తారమైన సాహిత్యం ఉద్భవిస్తుంది. ఇంగ్లీషు, హిందీ భాషల చెరలో నుండి మన తెలుగు పిల్లల్ని విడుదల చేసి, స్వేచ్ఛగా వారు తేనెలూరే తెలుగులో విజ్ఞాన శాస్త్రాలు చదవగలిగేలా చెయ్యాలి.

లండన్ నగరంలో 150 భాషలు మాట్లాడే 80 లక్షల మందిలో 30 లక్షల మందికి ఇంగ్లీషు మాతృభాషకాదట. వీళ్ళ కోసం 999 అనే ఎమర్జెన్సీ సర్వీసులో అనువాదకుల్ని పోలీసులు నియమించారట. అక్కడకు ఎన్ని కొత్త భాషలు మాట్లాడేవాళ్ళు వలస వచ్చినా, వారి కోసం అనువాదకుల్ని నియమిస్తూ "సమాచారం తెలుసుకోవటం ఆ ప్రజల ప్రాథమిక హక్కు" అంటున్నారట అక్కడి పోలీసులు. కానీ మన దేశంలో కోట్లాది మంది మాట్లాడే భాషల వాళ్ళకు కూడా వాళ్ళ భాషలో సమాచారం అందే హక్కు, అవకాశం మన దేశ రాజధాని నగరంలో ఉందా?

హిందీయేతర రాష్ట్రాల్లో త్రిభాషా సూత్రం ప్రకారం హిందీని రెండవ భాషగా నిర్బంధంగా నేర్పాలని చూస్తే తమిళనాడు ప్రజలు ఎదురు తిరిగారు. మిగతా రాష్ట్రాలన్నీ అమలు చేస్తున్నాయి. మరి హిందీ రాష్ట్రాల్లో హిందీయేతర భాషలు నేర్పటం లేదు. హర్యానాలో మాత్రం తెలుగు రెండో భాషగా కొన్ని పాఠశాలల్లో నేర్పుతున్నారట. దేశ సమగ్రత నిలవాలంటే హిందీ రాష్ట్రాలలో ఉత్తర భారత రాష్ట్రాలన్నిటిలో, ఏదో ఒక దక్షిణాది భాషను పిల్లలకు నేర్పించాలని గతంలో పెద్దలు చేసిన సూచన అమలు కాలేదు. ఎవరి భాషను వాళ్ళు వదిలేసి మరీ ఇంగ్లీషును ఆశ్రయించారు.

పూర్వం ప్రపంచమంతా ఒకే భాష, ఒకే పలుకు ఉన్నప్పుడు బాబేలు గోపురం కట్టటానికి నడుంకడితే, దేవుడే వారి ఏకైక భాషను వందలాది భాషలుగా చిందరవందర చేశాడట. ఇప్పుడు ప్రపంచ ప్రజలంతా మళ్ళీ ఇంగ్లీషు సాలెగూడు (ఇంటర్‌నెట్) కట్టారు. దేవుడు కూడా ఈ ఇంగ్లీషు వలలో పడతాడో, మరి ఆయనే చీల్చిన ఇన్ని వేల భాషల్ని రక్షించుతాడో కాలమే తేల్చాలి. ఇంగ్లాండ్ లోని ఇంగ్లీషు పిల్లలకు ఇంగ్లీషు నేర్పటానికి ఇండియన్ టీచర్లను కోరుకుంటున్నారంటే మన దేశం ఈ బాబేలు భాషలో ఎంత ముందుంజలో ఉందో ఊహించవచ్చు. మనవాళ్ళు బ్రతకనేర్చిన వాళ్ళు. సర్దుకు పోయే తత్వం గలవాళ్ళు. విడి పించే దిక్కు లేక దెబ్బలకు ఓర్చేవాళ్ళు. సిరిసంపదల కోసం సొంత భాషను సొంతం వదిలేయటానికైనా సిద్ధపడేవాళ్ళు. పొరుగింటి పుల్లకూర రుచి అని నిరూపించిన వాళ్ళు.

ఫౌండేషన్ ఫర్ ఎన్‌డేంజర్డ్ లాంగ్వేజెస్ ఛైర్మన్ నికొలాస్ ఓస్టలర్‌కు "తెలుగు అధికార భాష కావాలంటే..." పుస్తకం ఇ మెయిల్‌లో పంపాను. 2001 జనాభా లెక్కల ప్రకారం భారత దేశంలో వివిధ భాషలు మాట్లాడే వారి సంఖ్యా వివరాలు అడిగాను. వారి దగ్గర లేవు. 1997 నాటికి ప్రపంచ భాషల జనాభా అంచనాలు www. ethnologne. com లో ఉన్నాయి. కానీ 2001 నాటి భారతదేశ భాషల అధికారిక జనాభా లెక్కలు లేవు. వాటిని సంపాదించేందుకు 10-4- 2006న FEL లోని డాక్టర్ మహేంద్రకిషోర్ వర్మకు, CIILలోని డాక్టర్ ఉదయ నారాయణ సింగ్‌కు నా లేఖను పంపాను. ఆ లెక్కలు ఈ సంవత్సరమైనా వస్తే "తెలుగు అధికార భాష కావాలంటే... పుస్తకంలో వాటిని పొందుపరచి మన భాషల పెరుగుదల తరుగదల తీరుతెన్నులు విశ్లేషిద్దాం.

1974 నాటి జీవో 485 ప్రకారం సుప్రీం కోర్టు, హైకోర్టులలో మాత్రమే ఇంగ్లీషులో వ్యవహారాలు జరగాలనీ, క్రింది స్థాయి కోర్టులన్నిటిలో మాతృ భాషలో వ్యవహారాలు జరగాలనీ నిర్దేశించారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎబికె ప్రసాద్, హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంఘ్వీని కలిసి ఈ విషయమై విజ్ఞప్తి చేస్తే ఆయన జిల్లా కోర్టులకు ఆదేశాలిచ్చారట. ఇటీవల అయిదు హిందీ రాష్ట్రాల్లో హైకోర్టు స్థాయిలో కూడా హిందీలో వ్యవహారాలు నడపటానికి కేంద్రం అనుమతిం చిందట. (వార్త 27-3-2006). ఇలాంటి అనుమతి తెలుగుకు కూడా తెచ్చుకుంటే మన రాష్ట్ర భాషకు, ప్రజలకు గొప్ప మేలు జరుగుతుంది. చార్జి షీట్లు, డిమాండు పత్రాలు కూడా తెలుగులోనే జారీ చేయబోతున్నట్లు డి.జి.పి. స్వరణ్‌జిత్‌సేన్ ప్రకటించారు (ఈనాడు 12-4-2006). మన పోలీసు స్టేషన్లు, కోర్టులు, ఆఫీసుల్లో వ్యవహారాలన్నీ తెలుగులో జరుగుతూ ఉంటే మన ప్రజలకు సుఖం, మన విద్యార్థులకు భాషపై పట్టు దొరుకుతాయి. వాడకం వల్లనే భాష సజీవంగా ఉంటుంది. వాడకంలో లేని భాషతో ప్రజల్ని బాధపెట్టకూడదు. అలాగే పాలకులు కూడా బడా రాజ్యాల ప్రాపకం కోసం తమ భాషను చంపుకొని, తెలియని భాషను తెచ్చి ప్రజల మీద రుద్దకూడదు.

❖ ❖ ❖